## మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు




మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని శాలువాతో సన్మానించి మెమోంటో అందజేస్తున్న బృందం

మదనాపురం, మే 25 : మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన భారీ ఆంజనేయ స్వామి, దుర్గామాత 3వ వార్షికోత్సవ పూజలను దాతల సహకారంతో ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయకమిటీ అధ్యక్షుడు రజిత్‌కుమార్‌శెట్టి నేతృత్వంలో కమిటీ సభ్యులు తదితరులు అన్నదానం నిర్వహించారు.

## ప్రశాంతంగా గ్రామపాలన అధికారుల రాతపరీక్ష



పరీక్షా కేంద్రాన్ని తనిఖీచేస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల, మే 25 : జిల్లాలో ప్రశాంతంగా గ్రామపాలన అధికారుల పరీక్ష ముగిసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాన్ని అదనపు కలెక్టర్ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షను నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్షల్లో ఎటువంటి మాస్కా షిుంగ్ చేయించొద్దని అధికారులకు ఆదేశించారు. పరీక్షా ముగిసేంతవరకు సాఫీగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపాలన అధికారుల రాత పరీక్షకు మొత్తం 81 మంది అభ్యర్థుల్లో 77మంది హాజరుకాగా నలుగురు హాజరుకాలేదని తెలిపారు. పరీక్షకు 95.06 శాతం హాజరయ్యారన్నారు. ఎట్టకేలకు రాతపరీక్ష ప్రశాంత వాతావరణంలో ముగిసిందన్నారు. అదనపుకలెక్టర్ వెంట తాసీల్దార్ మల్లికార్జున, పరీక్ష నిర్వాహకుడు ఇమ్మానియల్ తదితరులు ఉన్నారు.

## కరాటే విద్యలో ప్రతిభ చాటిన విద్యార్థులు



విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేసిన అబ్దుల్‌నబీ

కొత్త కోట, మే 25 : గాడ్స్ ఆన్ వారియర్స్ షాటో ఖాన్‌కరాటే అకాడమి ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు బెస్ట్ గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేసినట్లు చీఫ్‌ఎగ్జామినేటర్ క్లబ్‌ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. పోటీల్లో 40మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఎల్లోబెల్ట్ 14మంది, బ్లూబెల్ట్ 10 మంది, గ్రీన్‌బెల్ట్ 10మంది, జూనియర్ బ్లాక్‌బెల్ట్ ఒకరు సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన మాస్టర్స్ జి.హరీష్, జాఫర్, సాధిక్, నన్నూలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, కరాటే మాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు జబ్బార్

పాన్‌గల్, మే 25 : మండలంలోని రేమద్దులలో చేపట్టబోయే డబుల్‌రోడ్డు విస్తరణలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు కోల్పోయే పేదలందరిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లాకార్యవర్గ సభ్యుడు జబ్బార్ కోరారు. ఆదివారం మండలంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డవిస్తరణలో ఎవ్వరికీ నష్టం కలగకుండా ప్రభుత్వం అభిప్రాయాలు సేకరిస్తూ తగినచర్యలు తీసుకోవాలని కోరారు. ఇండ్లు, ఇండ్ల స్థలాలు కోల్పోయే వారికి మొదటి ప్రాధాన్యతగా తీసుకొని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే కొత్తచెరువు అలుగు వరకు బ్రిడ్జి, నల్లకుంట అలుగు వరకు సీసీరోడ్డునిర్మాణం చేపట్టాలన్నారు. నాసీరకంగా లేకుండా నాణ్యవంతంగా పూర్తిచేయాలని కోరారు.అర్హులకు సంక్షేమపథకాలు అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, ఖాజా, మల్లేశ్, భాస్కర్, నిరంజన్ పాల్గొన్నారు.

## దళితుడిని దూషించిన ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

రాజోళి, మే 25 : మండలకేంద్రములోని చిన్న ధన్వాడ గ్రామానికి చెందిన దళిత మూగ రాజశేఖర్ పై రాజోళి ఎస్సై జగదీశ్ దళితుడని చూడకుండా కులం పేరుతో దూషించిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ నెల 23 తేదీన చిన్న ధన్వాడ గ్రామంలో 35వ సర్వే నెంబర్ చెందిన భూ వివాదంలో మూగ రాజశేఖర్‌ను స్టేషన్‌కు పిలిచి అసభ్యంగా మాట్లాడుతూ.. దాడి చేసినట్లు బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. అవినీతులకు పాల్పడుతున్న ఎస్సై వెంటనే సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ విషయంపై ఎస్సై జగదీశ్ వివరణ కోరగా.. వారు చెప్పేవి అవాస్తవమని తెలిపారు. ఆ వ్యక్తిపై వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి బైండోవర్ చేశామని మూగ రాజశేఖర్ పై ఎలాంటి తప్పుడు దూషించాడన్న మాటలు పూర్తి అవాస్తవమన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతంగా చేయాలి

ఖిల్లాఘణపురం, మే 25 : కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మాజీ ఎంపీపీ కృష్ణనాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని ఉప్పర్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాలవర్షాలతో ధాన్యం తడిసే ప్రమాదం ఉన్నందున అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని రైతులు నష్టపోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం సైతం లారీలు రాకబస్తాలు కూడా అలాగే ఉండిపోయాయన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం బస్తాలను తరలించేందుకు లారీలను పంపించి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, రైతులు ఉన్నారు.

## తుంగభద్ర డ్యాంకు నిలకడగా వరద

- ఇన్‌ఫ్లో 3,150 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 1,995 క్యూసెక్కులు

అయిజ, మే 25 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వానలకు తుంగభద్రకు వరద నిలకడగా కొనసాగుతున్నది. కొన్ని రోజులుగా డ్యాం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు టీబీ డ్యాంకు వరద వచ్చి చేరుతోంది. ఆదివారం ఇన్‌ఫ్లో 3,150 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1,995 క్యూసెక్కులు నమోదైంది. టీబీడ్యాం 100.855 గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 10.703 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి గానూ ప్రస్తుతం 1589.60 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. అలాగే కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద చేరుతోంది. ఎగువన కురుస్తున్న వానలకు 15,300వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, 15,300వేల క్యూసెక్కులు దిగువన ఉన్న సుంకేసుల బారాజ్‌కు చేరుతోందని ఆర్డీఎస్ కర్ణాటక డీఈ శాంతరాజు తెలిపారు. ప్రస్తుతం 8.7అడుగుల నీటిమట్టం ఉన్నట్లు పేర్కొన్నారు.



వనపర్తిలో అంబేద్కర్ చౌరస్తాలో కుంటను తలపిస్తున్న వర్షపునీరు



కృష్ణవేణి చౌరస్తాలో ఇలా,,..

# ప్రయాణం.. ప్రమాదకరం

- రోడ్లన్నీ జలమయం..
- అడుగో గుంత..
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- చిన్నపాటి వర్షాలకు పట్టణ వాసులకు తప్పని తిప్పలు
- నరకకూపాలు చౌరస్తాలు..

గద్వాల టౌన్, మే 25 : పాలకుల అసమర్థత పాలన.. అధికారుల నిర్లక్ష్యవైఖరి ప్రజల ప్రయాణం ప్రమాదంలో పడింది. ప్రయాణం ప్రమాదంలో పడటం ఏమిటి అన్న సందేహం మీకు రాక తప్పదు . అవునండి మన జిల్లా కేంద్రంలోని ప్రధానరోడ్లను చూస్తే మీకే అర్థమవుతుంది.. సామాన్య ప్రజలకు అర్థమైనంత మన పాలకులకు, అధికారులకు అర్థం కాక పోవడం మనం చేసుకున్న కర్మ అని సరిపెట్టుకోక తప్పదనిపిస్తుంది ప్రస్తుత పాలన చూస్తుంటే.

**రోడ్లన్నీ జలమయం..**

జిల్లా కేంద్రంలో ఆదివారం కురిసిన చిన్నపాటి వానకే ప్రధాన రోడ్లన్నీ జలమయంగా మారాయి. ప్రధాన రోడ్లన్నీ కూడా వాననీటితో నిండిపోయి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాన నీటికితోడు అడుగుకోగుంత ఉండడంతో రోడ్ల మీద ప్రయాణం చేయాలంటేనే నరకం కనిపిస్తుంది. వాన నీటితో ఉన్న గుంతలు కనిపించక పోవడంతో ప్రయాణికులు ప్రమాదానికి గురవుతున్నారు. ప్రధానంగా పాత బస్టాండ్, కృష్ణవేణి చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, కూరగాయల మార్కెట్ ఇలా ప్రధాన కూడళ్లన్నీ కూడా నరకకూపాలుగా మారాయి. అంబేద్కర్‌చౌరస్తా నుంచి రెండో రైల్వేగేట్‌కు వెళ్లాలంటే అరగంటకు పైగా పడుతుందంటే రోడ్డు ఏ స్థితిలో ఇట్టే అర్థమవుతుంది. చిన్నపాటి వానలకు ప్రయాణం చేయలేని పరిస్థితి ఉంటే రాబోయే వానకాలంలో కురిసే వానలకు బయటకు రావడమే మానేస్తారేమో అని పిస్తుంది. కాగా పారిశుధ్య సిబ్బంది కూడా పట్టణంలో పాలకులు భారీవర్షాలకు ముందస్తు చర్యలు కూడా పట్టించుకోవడం లేదు. రాబోయే రోజుల్లో ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రహదారులపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## త్వరగా తూకాలు చేసి పంపించాలి

- డీఎస్‌వో కాశీ విశ్వనాథం



కొనుగోలు కేంద్రాలలో వడ్లను పరిశీలిస్తున్న డీఎస్‌వో కాశీ విశ్వనాథం

పెద్దమందడి, మే 25 : కొనుగోలు కేంద్రాల వద్ద అధికంగా ధాన్యం ఉండడంతో త్వరగా తూకాలు చేసి పంపించాలని డీఎస్‌వో కాశీ విశ్వనాథం నిర్వాహకులకు సూచించారు. ఆదివారం మండలంలోని మనిగిళ్ల, దొడగుంటపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం అధికంగా ఉందని త్వరగా తూకాలు చేసి పంపించాలన్నారు. తూకాలు చేసిన బస్తాలే 5వేలున్నాయని ఐకేపీ నిర్వాహకులు, రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంబంధిత లారీ కాంట్రాక్టర్‌కు ఫోన్‌చేసి దొడగుంటపల్లికి సాయంత్రంలోగా 5లారీలు పంపించాలని చెప్పారు. ప్రతిరోజూ ఎన్ని బస్తాలు కాంటాలు చేస్తున్నారు, ఎన్నిబస్తాలు నిల్వఉన్నాయో తమకు తెలియజేయాలన్నారు. ఆదివారం సాయంత్రం వరకు 6 లారీలు రావడం జరిగిందని అన్నీ లోడ్‌చేసి పంపించడం జరిగిందని బుక్‌కీపర్ రాధా తెలిపారు. వడ్లలో ఇలాంటి తాలు లేకుండా చాలా మంచిగా ఉన్నాయని సంతోషించారు. డీఎస్‌వో స్పందించి లారీలను పంపించినందుకు గ్రామ రైతులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఐకేపీ నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు నష్టం
- మండల నాయకుల బీఆర్‌ఎస్ డిమాండ్



ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెబ్బేరు, మే 25 : ధాన్యం కొనుగోళ్ల విషయంలో కాంగెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. ఆదివారం పెబ్బేరు మున్సిపల్ పరిధిలోని చెలిమిల్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రానికి తెస్తే రైతులకు చుక్కలు చూపిస్తున్నారని చెప్పారు. అడుగడుగునా ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని, రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తోందని తెలిపారు. మరోపక్క అకాల వర్షాలకు సైతం ధాన్యం తడిసిపోయి తీవ్ర నష్టం జరుగుతున్నదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలకు వచ్చి ధాన్యాన్ని ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనాలని నాయకులు డిమాండ్ చేశారు. మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వనం రాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్దింటి వెంకటేశ్, వడ్డే ఈశ్వర్, సాయినాథ్, రామకృష్ణ, విశ్వరూపం, వేణు, మధు, వీరస్వామి, వడ్డే రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్రలు చేసినా పట్టించుకోరా..

- గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలి
- సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లి

ఖిల్లా ఘణపురం, మే 25 : మండలంలోని మామిడిమాడ శివారు భూముల్లో సాగుచేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వాలని భూ పోరాట సాధన సమితి, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో గత కొన్ని నెలలుగా ఆందోళనలు, పాద యాత్రలు చేసిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్రప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లి అన్నారు. ఆదివారం మండలంలోని మామిడిమాడ శివారులో సాగు చేస్తున్న గిరిజన భూముల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లి మాట్లాడుతూ.. భూ పోరాట కేంద్రాలైన వెనతండా, కర్నెతండాల్లో సభలు జరిపి దాదాపు 250 ఏండ్లుగా సాగుచేస్తున్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని సీలింగ్ చట్టం ప్రకారం రాజా బహుదూర్‌కు ఉన్న పట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. దున్నేవారికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజబహుదూర్ బినామీలను తరిమికొట్టాలని, ఓ వ్యక్తి పేరా 480ఎకరాలు ఉండడం సీలింగ్ యాక్ట్‌కు విరుద్ధమన్నారు. భూ అక్రమాల వెనుక పెద్ద హస్తం ఉందని కలెక్టర్‌కు, ఆర్డీవోకు, సీసీఎల్‌ఏకు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదన్నారు. భూ అక్రమదారులకు అండగా ఉన్నారా.. సీలింగ్ చట్టాలన్నీ అమలు జరిపి గిరిజనులకు భూములు ఇస్తారా లేదా తేల్చాలన్నారు. ఘణపురం మండలంలోని 8 గిరిజన తండాలకు చెందిన 800 గిరిజన కుటుంబాలకు చెందిన 480 ఎకరాల భూములను రాజా బహుదూర్ బినామీలు వచ్చి భూములు కబ్జా చేసుకునే ప్రయత్నాన్ని తిప్పికొట్టాలని కోరుతూ వ్యవసాయ కార్మికసంఘం, గిరిజనసంఘం, భూ పోరాట సాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సంపూర్ణ మద్దతిస్తుందని తెలిపారు. గుట్టలు, లోయలుగా ఉన్న భూములను తమ రక్తంచెమట తీసి సాగు భూములుగా మార్చుకున్న గిరిజనులకు పట్టాలు అంటే ఏమిటో తెలియకపోవడం వల్లే ఇన్నాళ్లు గుడ్డిగా బతికారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎంజిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, వివిధ సంఘాల నేతలు ఆంజనేయులు, బాల్యానాయక్, శక్రునాయక్, పరమేశ్వరచారి, లక్ష్మి, జయమ్మ, కృష్ణ, భరత్, దాసు, శ్రీను, లక్ష్మణ్‌నాయక్, రాజి, మన్నె, మద్దిలేటి ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అలంపూర్ చౌరస్తా, మే 25 : అలంపూర్ చౌరస్తా సమీపంలో కలుగోట్ల శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. కర్నూల్ జిల్లా నందవరం మండలం కనకవీడు పేటకు చెందిన బోయనారాయణ ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తా నుంచి కలుగొట్ల వైపునకు అంతర్రాష్ట్ర రహదారివైపు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ముగిసిన గ్రామపరిపాలన అధికారుల పరీక్ష

వనపర్తి టౌన్, మే 25 : జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రామపరిపాలన అధికారుల స్క్రీనింగ్‌పరీక్ష సజావుగా ముగిసినట్లు కలెక్టర్ ఆదర్శ్‌సురభి తెలిపారు. మొత్తం 97మంది వీఆర్‌వో, వీఆర్‌ఏలు దరఖాస్తు చేసుకోగా 90 మంది అభ్యర్థులు హాజరుకాగా ఏడుగురు గైర్హాజరైనట్లు చెప్పారు. రెవెన్యూ గ్రామపరిపాలన అధికారుల స్క్రీనింగ్ పరీక్ష సరళి ఆయన పర్యవేక్షించారు. జెఎన్‌టీయూ విశ్వవిద్యాలయంకు చేరవేయాలని లైజన్ అధికారి భానుప్రసాద్‌కు కలెక్టర్ ఆదేశించారు. నోడల్‌అధికారిగా అదనపుకలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ నోడల్‌అధికారి సుబ్రమణ్యం, చీఫ్‌సూపరింటెండెంట్ గురురాజ్, తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, ఆర్‌ఐ మధు, అబ్జర్వర్ సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వివాహిత ఆత్మహత్య


వడ్డేపల్లి, మే 25 : ఆర్థిక సమస్యలో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొంకలలో ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్సై నాగశేఖర్ రెడ్డితెలిపిన వివరాల ప్రకారం.. కొంకల గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్‌కు ఏపీలోని కర్నూల్ జిల్లా పాలకుర్తికి చెందిన సునీలతో వివాహం జరిగింది. అల్లుడువద్ద అత్త ఎర్రక్క తీసుకున్న అప్పు విషయంలో ఇంట్లో గొడవలు జరగగా, మనస్తాపానికి గురైన సునీల (25) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ఐదు నెలల బాలుడు ఉన్నారు. మృతురాలి తల్లి ఎర్రక్క ఫిర్యాదుమేరకు భర్త, అత్తామామలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## పండిత్ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న బీసీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్

అయిజ, మే 25 : రాష్ట్ర వ్యాప్తంగా మిగిలి పోయిన పండిత్ అప్‌గ్రేడ్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎన్ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం అయిజ పట్టణంలో ఆయన తెలుగు, హిందీ పండితులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అప్‌గ్రేడ్ పోస్టులు 800ఉన్నాయని, వాటిని లాంగ్వేజ్ పండితులు తెలుగు, హిందీ ఉపాధ్యాయులకు ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోగా పదోన్నతులు కల్పించి భర్తీచేసి, పండితుల కొరత లేకుండా చూడాలని కోరారు. గతంలో చేపట్టిన విధంగా ప్రతినెలా పండితులకు పదోన్నతులు కల్పించేందుకు ఉత్తర్వులను పునరుద్ధరించాలని, విద్యాసంవత్సరం ప్రారంభంలోగా బదిలీలు, పదోన్నతులను అన్ని కేటగిరీల వారీగా చేపట్టాలని తెలిపారు. ప్రతిపాఠశాలలో రికార్డు అసిస్టెంట్, వాచ్‌మెన్లు, స్కావెంజర్లు, వంటఏజెన్సీ నిధులను ముందస్తుగానే విడుదల చేయాలని, గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించి, పాఠశాలల బలోపేతానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని అమలు చేయాలని, సుదీర్ఘంగా అపరిష్కృతంగా ఉన్న జూనియర్ లెక్చరర్ పోస్టుల ప్రమోషన్లు, డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోల పదోన్నతులను చేపట్టాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన జీపీఎఫ్ పార్ట్ ఫైనల్ నిధులు సకాలంలో చెల్లించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నాగరాజు, పండితులు అరుణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## పూర్వవిద్యార్థుల సమ్మేళనం

రేవల్లి, మే 25 : మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 27ఏండ్లతర్వాత చిన్ననాటి మిత్రులను పాఠశాలలో కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## పంపిణీకి జీలుగ విత్తనాలు సిద్ధం

వడ్డేపల్లి, మే 25 : మండలంలోని రైతుల కోసం జీలుగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏవో రాధ ఓ ప్రకటనలో తెలిపారు. 50శాతం సబ్సిడీలో 167బ్యాగులు పంపిణీ చేయడానికి అగ్రో సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జీలుగువిత్తనాలు కావాల్సిన రైతులు సోమవారం వ్యవసాయ కార్యాలయానికి రైతు పట్టాపాసుపుస్తకం, రైతు ఆధార్ కార్డులు తీసుకొని రావాలని కోరారు.

## దరఖాస్తుల ఆహ్వానం

గట్టు, మే 25 : ఉన్నతి ఫౌండేషన్ ఆఫ్ ఎంప్లాయిమెంట్‌ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా గురుకుల పూర్వ విద్యార్థులకు ఉచిత శిక్షణను కల్పించనున్నట్లు గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ శోభా రాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ చదివి 25ఏండ్ల లోపు ఉన్న గురుకుల పూర్వవిద్యార్థులు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తిగల పూర్వ విద్యార్థులు తమ పాఠశాల, కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

## ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ

అయిజ, మే 25 : అయిజ పట్టణంలోని ప్రభుత్వ, హరిహర జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఆదివారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సభ్యులు రాజేందర్, డీటీ శివ కుమార్‌లు తనిఖీచేశారు. పరీక్షల్లో ఎలాంటి కాపీయింగ్ జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని సీఎస్‌లను ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం ఆదేశించింది. పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా జరిగేలా చూడాలని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై వెంకటేశ్వర్‌రెడ్డి, సీఎస్‌లు, డీవోలు తదితరులు పాల్గొన్నారు.

## మొదలైన వర్షాలు

గట్టు, మే 25 : రోహిణికార్తె మొదలైందంటే వర్షాకాలం ప్రారంభమని చెబుతారు. రోహిణి కార్తె ప్రారంభం కాకముందే వర్షాలు కురియడం మొదలయ్యాయి. దీంతో రైతులు ఆనంద పడుతున్నారు. కాగా నైరుతి రుతుపవనాలు ముందే వస్తుండడంతో తొలకరి జల్లులు పడడం ప్రారంభమయ్యాయి. రైతులు ఖరీఫ్ పనులు ప్రారంభించడానికి సమాయత్తమవుతున్నారు. ముందు మురిపించి తరవాత వర్షాలు కనుమరుగవుతాయోనని ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది.

## సింగిల్ విండో ద్వారా రుణాలు

అయిజ, మే 25 : సింగిల్ విండోద్వారా దీర్ఘ కాలిక రుణాలతోపాటు స్వల్ప కాలిక రుణాలను మంజూరు చేయనున్నట్లు సింగిల్ విండో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, గొర్రెలు, బర్రెలు ఇతర రుణ పథకాలకు డీసీసీబీ బ్యాంక్ నుంచి దీర్ఘ కాలిక రుణాలను మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల అర్బన్, మే 25 : అక్రమంగా రేషన్‌బియ్యం తరలిస్తున్న బొలేరో వాహనాన్ని పోలీసులు పట్టుకున్న ఘటన నందిన్నె చెక్‌పోస్టు దగ్గర చోటు ఆదివారం చేసుకున్నది. కేటీదొడ్డి ఎస్సై శ్రీనివాసులు కథనం మేరకు... ధరూర్‌కు చెందిన వెంకటేశ్ జిల్లాకేంద్రంలోని దాదాపు 30క్వింటాళ్ల రేషన్‌బియ్యాం అక్రమంగా రాయిచూర్‌కు తరలించేందుకు సిద్ధమయ్యాడు.ఈ క్రమంలో నందిన్నె చెక్‌పోస్టు దగ్గర వాహన తనిఖీ చేస్తుండగా రేషన్‌బియ్యాం తరలిస్తున్న వాహనాన్ని గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారుతెలిపారు. ఈ క్రమంలో రేషన్‌బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అనంతరం వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.